ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
శుక్రవారం 12 జనవరి 2024



మాట్లాడుతున్న సఫాయి కరంచారి జాతీయ కమిషన్ సభ్యుడు డాక్టర్ పీపీ వవ



పారిశుధ్య కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● సఫాయి కరంచారి జాతీయ కమిషన్ సభ్యుడు

కడప(కలెక్టరేట్), జనవరి 11: పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం, కుటుంబ భద్రత, సంక్షేమం కోసం సఫాయి కరంచారి జాతీయ కమిషన్ నిరంతరం పాటుపడుతోందని కమిషన్ సభ్యుడు డాక్టర్ పీపీ వవ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ లోని స్పందన హాల్లో జిల్లాలో సఫాయి కరంచారీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోజు సమాజం ఆరోగ్యకరంగా, ఆహ్లాదంగా ఉందంటే సఫాయి కరంచారి వ్యవస్థలోని పారిశుధ్య కార్మికుల శ్రమ ఫలితమే అన్నారు. పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబాలు ఆరోగ్యంగా ఉంటేనే నగరాలు, పట్టణాలు, గ్రామాలు ఆరోగ్యవంతంగా ఉంటాయన్నారు. స్వచ్ఛభారత్ మిషన్ సఫలీకృతంలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో ఉందన్నారు. సఫాయి కరంచారీల కోసం ఆయుష్మాన్ భారత్ ద్వారా హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ, ఆవాస్ యోజన కింద హౌసింగ్ పథకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. అంతకు ముందు పారిశుధ్య కార్మికుల వృత్తిపర, ఆర్థిక ఇబ్బందులను కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, ఏఎస్పీ తుషార్ డూడి, సాంఘిక సంక్షేమశాఖ డీడీ సరస్వతి, జిల్లా అధికారులు సుధాకర్ రెడ్డి, ప్రభార్‌రెడ్డి, డాక్టర్ హెచ్ వెంకటసుబ్బయ్య, జయసింహ, డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ద్వారా ఎంప్లాయ్‌మెంట్ నమోదు : కలెక్టర్

కడప(కలెక్టరేట్), జనవరి 11: నిరుద్యోగులు జిల్లాలో ఎక్కడి నుంచైనా ఆన్‌లైన్ ద్వారా ఎంప్లాయ్‌మెంట్ నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్‌లు, మోడల్ కెరీర్ సెంటర్ల ద్వారా అందించే సేవలు (ఎంప్లాయ్‌మెంట్ రిజిస్ట్రేషన్, రెన్యువల్, అదనపు అర్హతల నమోదు) సంబంధిత ఎంప్లాయ్‌మెంట్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా అందిస్తున్నామన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని ఇంటర్నెట్, మొబైల్ ఫోన్‌ల ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చన్నారు. వివరాలు జిల్లా ఉపాధికల్పనాధికారి కార్యాలయానికి చేరగానే సంబంధిత అధికారి వెంటనే ఎస్ఎంఎస్ ద్వారా ఎంప్లాయ్‌మెంట్ నెంబరు తెలియజేస్తారని కలెక్టర్ వివరించారు.

4,920 మందికి కొత్త రేషన్ కార్డులు : జేసీ

జిల్లాలో 4,920 కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని జాయింట్ కలెక్టర్ జి.గణేశ్‌కుమార్ తెలిపారు. ద్వైవార్షిక పథకంలో భాగంగా జిల్లావ్యాప్తంగా అర్హులై ఉండి జూలై 2023 నుంచి డిసెంబరు 2023 మధ్య కొత్త కార్డులకు, కార్డు విభజనకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారికి మంజూరయ్యాయన్నారు. రైస్ కార్డులు పొందిన వారు జనవరిలో నిత్యావసర సరుకులు తీసుకోవచ్చన్నారు.

బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు : టీటీడీ జేఈవో

ఒంటిమిట్ట, జనవరి 11: కోదండరాముడి బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నట్లు టీటీడీ జేఈవో వీరబ్రహ్మం తెలిపారు. గురువారం కోదండరామాలయం అభివృద్ధి పనుల్లో భాగంగా టీటీడీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా రామాలయంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. రామాలయం వద్ద చేపట్టవలసిన అభివృద్ధి పనులు, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పార్వేటి మండపానికి సిమెంటు రోడ్డు వేయాలని నిర్ణయించారు. వీటితో పాటు పురాతన మండపాలను అభివృద్ధి పరచాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. రామాలయ అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వ స్థలాల్లో ఉన్న ఆక్రమణలను తొలగించాలని ఆర్డీవో మధుసూదన్‌కు తెలిపారు. అనంతరం కల్యాణ వేదిక వద్ద జరుగుతున్న పనుల వివరాలను తెలుసుకున్నారు. కల్యాణ వేదిక ప్రాంతంలో కొంతమంది కాంట్రాక్టర్లు సమయానికి అనుకూలంగా పనులు చేయడం లేదని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తక్కువగా ఉన్నాయని అలాంటి వారి పేర్లను బ్లాక్‌లిస్టులో పెడతామని హెచ్చరించారు. మళ్లీ వారు టెండర్లలో పాల్గొనేందుకు వీలు లేకుండా చేయాలని టీటీడీ సీఈ నాగేశ్వరరావును జేఈవో ఆదేశించారు. బ్రహ్మోత్సవాలు ఏప్రిల్‌లో నిర్వహిస్తామని, ఫిబ్రవరి చివరి నాటికి క్షేత్రస్థాయిలో సివిల్ పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో కడప ఆర్డీవో మధుసూదన్‌రావు, తహసీల్దార్ మాధవీలత, ఎంపీడీవో రెడ్డయ్య, సీఐ పురుషోత్తం రాజు, ఏఈ అమర్‌నాథ్‌రెడ్డి, డిప్యూటీ ఈవో నటేష్ బాబు, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

కార్పో..రేట్..!



గతంలో ప్రజాప్రతినిధి ఎన్నికైతే ఐదేళ్ల పదవీ కాలంలో తన మార్కు అభివృద్ధి చూపించుకోవాలని తాపత్రయ పడేవారు. అయితే జగన్ హయాంలో జనం ఓట్లతో గెలిచిన వారు తక్కువ. బెదిరించి భయభ్రాంతులకు గురిచేసి ఏకగ్రీవంగా ఎన్నికయిన వారే ఎక్కువ. అందుకేనేమో అదే స్టైల్‌లో తమ వ్యవహారం కొనసాగిస్తున్నారన్న విమర్శ ఉంది. ముఖ్యంగా కడపలో కొందరు కార్పొరేటర్ల ధనదాహంపై తీవ్ర విమర్శలు రేగుతున్నాయి. ప్రతి దానికీ ఓ రేటు పెట్టారని చెబుతారు. సంక్షేమ పథకాలు ఇతరత్రా వాటి సర్వేకోసం సచివాలయ సిబ్బంది లేదా వలంటీర్లు సర్వేకు వెళితే కొందరేమో తృణమో ఫలమో ముట్టజెబితే.. దానిలో కూడా కొందరు వాటాలు అడుగుతారనే విమర్శ ఉంది. వీళ్లని కార్పొరేటర్లు అనడం కన్నా కార్పొ..రేట్ అంటే బాగుంటుందని విమర్శిస్తుండడం గమనార్హం.

(కడప-ఆంధ్రజ్యోతి): ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా అన్న చందంగా వైసీపీలో కొందరు ముఖ్య నేతలు పదవులు, అధికారాన్ని అడ్డు పెట్టుకుని అడ్డంగా దోచేస్తున్నారు. ముఖ్యంగా కడపలో కొందరు కార్పొరేటర్ల తీరు చూస్తే వామ్మో కార్పొరేట్లా అంటూ జనం భయపడుతున్నారు. ఎందుకంటే భవనం కట్టాలంటే కప్పం కట్టాల్సిన పరిస్థితి దాపురించడమే దీనికి కారణం. కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేందుకు శులభతరం చేశామని సచివాలయాల రాకతో పాలనలో మార్పులు వచ్చాయని ప్రభుత్వం చెప్పుకుంటోంది. అయితే ఆ సచివాలయాలే గ్రామాల్లో కొందరు సర్పంచ్, ఎంపీటీసీలకు, పట్టణాల్లో కొందరు కార్పొరేటర్లకు ఆదాయ వనరులుగా మారాయన్న విమర్శ ఉంది. కడప కార్పొరేషన్‌లో 50 మంది కార్పొరేటర్లు ఉన్నారు. టీడీపీ నుంచి ఒకరు గెలుపొందగా, ఇండిపెండెంట్ అభ్యర్థిగా మరొకరు గెలిచారు. 48 మందిలో చాలా మటుకు ఏకగ్రీవాలే.

భవనం కడితే కప్పం కట్టాల్సిందే

కడప నగరంలో కొందరు కార్పొరేటర్లు ధనపిశాచాలుగా మారారనే విమర్శ ఉంది. వారి పరిధిలో భవనం కట్టాలంటే వీరికి కప్పం కట్టాల్సిందే అంటున్నారు. కడప నగరంలో పలు కార్పొరేట్ సంస్థలు బ్రాంచ్‌లు ఏర్పాటుచేస్తున్నాయి. శివారు ప్రాంతాల్లో వెంచర్లు వేస్తున్నారు. బ్యాంకు రుణాలు తీసుకుని దానికి కష్టపడి దాచుకున్న సొమ్ము కలిపి ఇళ్లు కట్టుకుంటున్నారు. దీంతో నిర్మాణాలు, ఇటు వెంచర్ల సంఖ్య పెరిగిపోతోంది. అయితే వీటిని సచివాలయ సిబ్బంది ద్వారా కొందరు కార్పొరేటర్లు ఆదాయ వనరుగా మార్చుకుంటుండడం విమర్శలకు తావిస్తోంది. ఒక్కోదానికి రేటు ఫిక్స్‌చేసి మరీ వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. కప్పం కట్టకపోతే నిర్మాణ అనుమతులు, ప్లాన్లలో వత్తిడి తీసుకురావడం చర్చనీయాంశమైంది. వాణిజ్య భవనానికి అయితే రూ.5 లక్షలు, ఇంటికి అయితే రూ.30వేలు, వెంచరు వేస్తే ఆ ఏరియాను బట్టి ఎకరాకు లక్ష చొప్పున వసూలు చేస్తారనే ప్రచారం సాగుతోంది.

వామ్మో వాళ్లా

చిన్నచౌకు పరిధిలో 14 మంది కార్పొరేటర్లు ఉన్నారు. వీరిలో కొందరు తమ వార్డుల్లో నిర్మాణాలకు కప్పం వసూలు చేస్తారని అంటారు. కప్పం కట్టకపోతే నిర్మాణాలు ముందుకు సాగనివ్వరంటారు.

● ఓ వాణిజ్య భవన నిర్మాణానికి రూ.5లక్షలు డిమాండ్ చేయగా, అంత ఇచ్చుకోలేమంటే వత్తిడి తెచ్చారని చెబుతారు. చివరికి ఓనరు, ఆ సంస్థ చెరిసగం ఇచ్చినట్లు చెబుతారు. నగరంలో ఓ ప్రధాన రహదారిలో ఓ వాణిజ్య భవన నిర్మాణం సాగుతోంది. ఐదులక్షలు ఇవ్వాలని ఆ ప్రాంత కార్పొరేటరు డిమాండ్ చేసినట్లు చెబుతారు. చివరికి ఓ దేవస్థానం కమిటీ మెంబరుగా ఉండే వ్యక్తి రంగప్రవేశం చేసి చివరకు లక్షకు తగ్గించారని అంటారు.

● ఓ ప్రధాన కూడలిలో సెట్‌బ్యాక్ లేకుండానే నిర్మాణం చేపట్టారు. అదనపు అంతస్తు వేశారు. దీనిని గతంలో ఆంధ్రజ్యోతి వెలుగులోకి వచ్చింది. ఇక్కడి కార్పొరేటరుతో పాటు ఓ ఇద్దరు కీలక నేతలు పంచాయితీ చేసిన భారీ ఎత్తున డబ్బు వసూలు చేసినట్లు చెబుతారు.

● మరొకటి కడపలో ప్రధాన కూడలిగా పేరొందింది. ఈ ప్రాంతాల్లో కమర్షియల్ నిర్మాణాలు జరిగితే ఆయనకు పండగే అంటారు. పైకి ఏమో తియ్యని మాటలు చెబుతారంటారు. నిర్మాణాలకు సంబంధించి కప్పం కట్టకపోతే సచివాలయ సిబ్బంది ద్వారా వత్తిడి తెచ్చి పనులు అడ్డుకుంటారంటారు.

అడ్డుకుంటే దాడులు

నగర శివారులో కడపకు చెందిన ప్రముఖ నేతలు, ప్రజాప్రతినిధులు, ఇతర పదవుల్లో ఉన్న వారు ఓ రింగురోడ్డులో వెంచర్లు వేస్తున్నారు. కొందరు సొంతంగా వేస్తే మరికొందరు భాగస్వాములతో కలిసి వెంచర్లు వేస్తున్నారు. బైపాస్ రోడ్డులో ఓ వెంచర్ వేశారు. అక్కడ కార్పొరేటరు ఎకరాకు రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు చెబుతారు. ఇది మాది కాదు, రాష్ట్రస్థాయి కార్పొరేషన్ డైరెక్టరు ఉన్నారని చెబితే ఆయన వాటా మినహాయించుకుని మిగతాది ఇవ్వాలని డిమాండ్ చేశారంటారు. చివరికి వారు ఆ లీడరు దృష్టికి తీసుకెళితే నేరుగా ఆయన ఫోను చేయాల్సిన పరిస్థితి వచ్చిందంటారు. చివరికి ఆ డిమాండ్ చేసినంత కాకుండా అంతో ఇంతో సర్దుబాటు చేసినట్లు చెబుతారు. పులివెందుల రోడ్డులో సుమారు 10 ఎకరాలలో లే అవుట్ వేశారు. ఈ ప్రాంతం గ్రామీణ పరిధిలోకి వస్తుంది. 33 శాతం ఫీజులు చెల్లించేందుకు రియల్టర్ సిద్ధమయ్యారంటారు. బిల్లులు కూడా జనరేట్ అయితే ఓ ప్రజాప్రతినిధి ఎకరాకు లక్ష డిమాండ్ చేశారు. రేటే లేని చోట ఇంత డిమాండ్ చేయడం ఏంటని రియల్టర్ విస్తుపోయారు.

ఈయనదో స్టైల్

కొందరు కార్పొరేటర్లు భవన నిర్మాణాలకు, లే అవుట్లకు కప్పం అడిగితే.. ఈయన మాత్రం డబ్బుకు బదులు లేఅవుట్లలో ప్లాట్లు అడుగుతారని అంటారు. ఈయన కూడా రియల్టర్‌గా ముద్ర పడ్డారు. ఒకవేళ ఈయన చెప్పినట్లు ప్లాట్లు ఇవ్వకపోతే ఆ వెంచరు నాదంటూ మౌత్ పబ్లిసిటీకి తెరలేపి రియల్టర్లతో మైండ్ గేమ్ ఆడుతారని ప్రచారం ఉంది.

ఇవ్వకపోతే దాడులు

కార్పొరేటర్లు చెప్పినట్లు వినకపోతే వార్డు ప్లానింగ్ కార్యదర్శులపై దాడులకు దిగి బెదిరింపులకు గురిచేస్తున్నారని అంటున్నారు. గతంలో చిన్నచౌకు పరిధిలో అనుమతి లేకుండా నిర్మాణాలు చేస్తున్న భవనాలు కూల్చివేసేందుకు వచ్చిన సచివాలయ సిబ్బందిపై ఓకార్పొరేటరు అనుచరులు దాడి చేశారు.



● భవనం కట్టాలంటే.. కప్పం కట్టాల్సిందే
● కమర్షియల్ కాంప్లెక్స్ అయితే రూ.5 లక్షలు
● లే అవుట్ అయితే ఎకరాకు రూ.లక్ష
● ఇంటి నిర్మాణం అయితే రూ.30వేలు
● ఓ కార్పొరేటరు డబ్బుకు బదులు లేఅవుట్‌లో ప్లాట్ల డిమాండ్
● ఇదీ కడపలో కొందరు కార్పొరేటర్ల కహానీ

ఈ దుస్థితి ఎప్పుడూ లేదు

"మేం కార్పొరేటర్లుగా పనిచేశాం. మా పాలకవర్గంలో చాలా వరకు మా ఏరియా అభివృద్ధికి ఖర్చుపెట్టాం. సంక్షేమ పథకాలు అర్హులైన వారికి ఇప్పించేవారం. అయితే ఇప్పుడు కొందరిని చూస్తుంటే వీరు కార్పొరేటర్లా అనిపిస్తోంది. వీరు ఆ పదవికే మచ్చ తెస్తున్నారు. అప్పట్లో కాంట్రాక్టు పనులు చేసేవారు తృణమో ఫలమో కార్పొరేటర్లకు ఇచ్చేవారు. అయితే ఇప్పుడు సామాన్యులు ఇల్లు కట్టుకోవాలన్నా సరే డబ్బులు ఇవ్వాలని వత్తిడి తెస్తున్నార . ఇది చాలా అన్యాయం" అని ఓ ఇద్దరు మాజీ సీనియర్ కార్పొరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతగా దిగజారారంటే జగనన్న కాలనీలు నిర్మించే ఓ ఏరియాలో ఆప్షన్-3 కింద ప్రభుత్వమే కాంట్రాక్టర్ల ద్వారా జగనన్న ఇళ్లు కట్టిస్తోంది. కడపలో పలు కాలనీల్లో నిర్మిస్తున్నారు. అయితే ఆ ఏరియా కొందరు కార్పొరేటర్ల పరిధిలోకి వస్తుంది. వారు ఆ కాంట్రాక్టరును బెదిరించి ఒక్కో ఇంటికి రూ.15వేలు వసూలు చేశారంటారు. ఇంకా కొందరు కార్పొరేటర్లయితే వలంటీర్లు, సచివాలయ సిబ్బందిని చెప్పుచేతల్లో పెట్టుకుని మీకొచ్చేదాంట్లో మాకు సగం ఇవ్వాలంటూ వత్తిడి తెస్తున్నారనే విమర్శలున్నాయి. మొత్తానికి కడపలో కొందరు కార్పొరేటర్ల తీరు కార్పొ.రేటుగా మారిందంటారు.

జగనన్న తోడుతో ఆర్థిక చేయూత : కలెక్టర్

కడప (కలెక్టరేట్), జనవరి 11: నిరుపేదలైన చిరు వ్యాపారులు, హస్తకళాకారులు, సంప్రదాయ చేతివృత్తుల వారు నిలదొక్కుకునేలా రాష్ట్ర ప్రభుత్వం జగనన్నతోడు ద్వారా ఆర్థిక చేయూత ఇస్తోందని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి జగనన్న తోడు 8వ విడత లబ్ధి మొత్తాన్ని సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్‌తో పాటు డీఆర్డీఏ పీడీ ఆనందనాయక్, మెప్మా పీడీ సురేశ్‌రెడ్డి, ఎల్డీఎం దుర్గాప్రసాద్, బద్వేలు ఎమ్మెల్యే సుధ తదితరులు హాజరయ్యారు. సీఎం కార్యక్రమం ముగిసిన అనంతరం జిల్లాలో జగనన్న తోడు ద్వారా రూ.10వేల చొప్పున వడ్డీలేని రుణాలకు మంజూరైన మొత్తానికి సంబంధించిన మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ రుణాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలని కోరారు. అర్హత ఉండీ ఎవరికైనా జగనన్న తోడు లబ్ధి అందకుండా ఉంటే సంబంధిత సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



జగనన్న తోడు మెగా చెక్కును అందిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

రైతులు పోరాటాలకు సిద్ధం కావాలి

● ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య



కడప (సెవెన్ రోడ్స్), జనవరి 11: ఎన్నికల ముందు వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తామని మోదీ, పండుగ చేస్తామని జగన్ నమ్మబలికి అధికారంలోకి వచ్చాక రైతాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడ్డారని వారికి బుద్ధి చెప్పడానికి రైతులు సమరశీల పోరాటాలకు సమాయత్తం కావాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య పిలుపు నిచ్చారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ గిట్టుబాటు ధరలు కల్పించడంలో పాలక ప్రభుత్వాలు ఘోరంగా విఫల మయ్యాయన్నారు. కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత లేకపోవడంతో ట్రేడర్స్ దోపిడీకి అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు. వ్యవసాయ రుణాలు పూర్తిగా మాఫీ చేసి రైతులను రుణవిముక్తులను చేయాల న్నారు. రైతు రుణమాఫీకి నిరాకరిస్తున్న మోదీ ప్రభుత్వం మొండిబకాయిల పేరుతో లక్షల కోట్ల బ్యాంకు ఎగ్గొట్టిన వారికి కొమ్ము కాస్తోందన్నారు. రాష్ట్రంలో రైతు ప్రభుత్వమని చెప్పుకునే జగన్‌రెడ్డి కేంద్రంలో బీజేపీ తీసుకుంటున్న రైతాంగ వ్యతిరేక చర్యలను సమర్థిస్తూ రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలను కాపాడడంలో ఘోరంగా విఫలమయ్యారన్నారు. రైతు భరోసా రాష్ట్ర వాటా రూ.12వేలకు బదులు రూ.7500 ఇచ్చిన నాడే జగన్ వైఖరి ఏంటో బయటపడిందన్నారు. పెండింగులో ఉన్న గాలేరునగరి, హంద్రీనీవా, తెలుగుగంగ, రాజోలి, వెలిగొండ, తుంగభద్ర, ఎగువ, దిగువ కాల్వలు, క్రిష్ణ డెల్టా ఆధునికీకరణ, వంశధార, నాగావళి వంటి ప్రాజెక్టులు పూర్తి చేయలేక పోయారన్నారు. రాష్ట్రంలో 448 మండలాల్లో కరువు విలయతాండవం చేస్తోంద న్నారు. కేవలం 103 మండలాలు మాత్రమే ప్రకటించి సొంత జిల్లా కడపలో ఒక్క మండలం కూడా కరువు జాబితాలో చేర్చకపోవడం విచారకరమన్నారు. కరువు మరువకముందే మిచౌంగ్ తుఫాను చేతకొచ్చిన పంటలను చేలోనే ముంచేసిందన్నారు. రానున్న రోజుల్లో ప్రాంతాల వారీ రైతాంగ సమస్యల పరిష్కారమే ఏకైక అజెండాగా పాలక ప్రభుత్వాలపై పోరాటాలు చేపట్టనున్నామన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మూలె వెంకటసుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్, ఉపాధ్యక్షులు బాలచంద్రయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కుల అడ్డా

పెండ్లిమర్రి .. ఈ పేరు వింటేనే సహజవనరులైన ఐరన్ ఓర్, ఇసుక గుర్తుకు వస్తాయి. చామంతి పూల సాగుకు ప్రసిద్ధి. అలాంటి గడ్డ ఇపుడు అక్రమాలకు అడ్డాగా మారింది. వైసీపీ ప్రభుత్వ పాలనకు గడువు దగ్గర పడుతోంది. మళ్లీ అధికారం కలేనన్న విషయాన్ని పసిగట్టారు. అందుకనే దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలన్నట్టుగా చేతిలో పవర్ ఉన్నప్పుడే సంపాదించుకోవాలని డిసైడ్ అయి అడ్డంగా అక్రమాల బాటపట్టారు. ఇంకేముంది... ఇసుక, గ్రావెల్ 24/7 చొప్పున తోలేస్తూ రోజూ లక్షలు వెనుకేసుకుంటున్నారు. అక్రమాలను అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూడకుండా అధికార పార్టీ నేతలకు జీ హుజూర్ అంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

● అనుమతులు లేకుండానే..
● రాత్రిపగలు గ్రావెల్, ఇసుక తవ్వకాలు
● కన్నెత్తి చూడని అధికారులు



తుమ్మలూరు పాపాఘ్ని వద్ద అధికారులు సీజ్ చేసిన హిటాచి, టిప్పరు

పెండ్లిమర్రి, జనవరి 11: మండల పరిధిలోని చిన్నదాసరిపల్లె, పగడాలపల్లె, గంగనపల్లె, తుమ్మలూరు ప్రాంతాల్లో గ్రావెల్ ఉంది. మార్కెట్‌లో గ్రావెల్‌కు విపరీతమైన డిమాండ్ ఉంది. కడప నగరం, యోగివేమన యూనివర్సిటీ చుట్టూ కుప్పలు తెప్పలుగా వెంచర్లు వెలుస్తున్నాయి. కొప్పర్తి పారిశ్రామిక వాడలో పరిశ్రమల ఏర్పాటుకు నేలచదును కోసం గ్రావెల్ అవసరం కావడంతో మంచి డిమాండ్ ఏర్పడింది. టిప్పర్ రూ.6వేల నుంచి రూ.8వేలకు విక్రయిస్తున్నారు. డిమాండ్ ఉండడంతో కొందరు వైసీపీ నేతలు ముఠాగా ఏర్పడి మాఫియాగా మారి గ్రావెల్‌ను తవ్వేస్తున్నారు.

ఇక పాపాఘ్ని నదిలో ఇసుక తవ్వకాలకు తువ్వపల్లె, ఉలవకపల్లె గ్రామాలవద్ద ప్రభుత్వ అనుమతులు ఉన్నాయి. అయితే వాటికి సమాంతరంగా తుమ్మలూరు వద్ద పాపాఘ్ని నది నుంచి పగలు, రాత్రి తేడా లేకుండా ఎక్స్‌కవేటర్లతో ఇసుకను తవ్వి టిప్పర్ల ద్వారా ఈ ముఠా అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో ఇసుక తవ్వకాలకు అనుమతి ఉన్న జేపీ వెంచర్ పగడాలపల్లె వద్ద ఇసుక నిల్వ కేంద్రాన్ని ఏర్పాటుచేసింది. ఆ ఇసుక నిల్వ కేంద్రంలో ఉన్న ఇసుకను కూడా ఈ అక్రమార్కులు రాత్రిపూట యంత్రాలు పెట్టి టిప్పర్ల ద్వారా ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

ప్రత్యేక ఆఫర్

పండుగలు, పబ్బాలు, వార్షికోత్సవాలకు వ్యాపారులు అమ్మకాల కోసం ధర తగ్గింపు, 1+1, 2+3, అంటూ ప్రత్యేక ఆఫర్లు ఇచ్చి కొనుగోలు దారులను ఆకర్షిస్తారు. అయితే ఈ గ్రావెల్ ఇసుక మాఫియా కూడా ప్రత్యేక ధరలు ప్రకటించారని చెబుతారు. మార్కెట్‌లో అనుమతి ఉన్న క్వారీ నుంచి తరలించే గ్రావెల్, ఇసుక, టిప్పర్ల మీద దూరాన్ని బట్టి రూ.1000 నుంచి రూ.2వేల వరకు ధర తగ్గించి అమ్మేస్తుండడంతో వీరికి మంచి గిరాకీ ఉంది. రాత్రి, పగలు తేడా లేకుండా తవ్వేసి రోజుకు లక్షలు ఆర్జిస్తున్నారు. వారికి ఎక్స్‌కవేటర్లు, టిప్పర్ల బాడుగ మాత్రమే ఖర్చు. మిగతాదంతా ఆదాయమే.

కళ్లున్న కబోదులు

రాత్రి, పగలు తేడా లేకుండా కడప-పులివెందుల ప్రధాన రహదారి గుండా గ్రావెల్, ఇసుక తరలిస్తున్నా అధికారులు కళ్లులేని కబోదుల్లా ఉండడం మండలంలో తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ప్రధాన రహదారిపైనే తహశీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ ఉన్నాయి. అయినా ఈ అధికారులు పట్టించుకో కపోవడంతో అమ్యామ్యాలు తీసుకున్నారా.. లేక అధికారానికి భయపడి సైలెంట్‌గా ఉన్నారా అనే చర్చ జరుగుతోంది.

పట్టుకున్నారు.. వదిలేశారు

తుమ్మలూరు వద్ద పాపాఘ్నినదిలో పట్టపగలు అక్రమంగా ఇసుకను తవ్వి తరలిస్తుండగా ఈనెల 6వ తేదీ రెండు టిప్పర్లు, ఒక హిటాచిని అధికారులు సీజ్ చేశారు. సీజ్ చేసిన వాహనాలను మండల కేంద్రానికి తీసుకొచ్చారు. వీటిని ఎవరు పట్టుకున్నారని విచారించగా మేము పట్టుకోలేదు, మేము పట్టుకోలేదంటూ పోలీసు, రెవెన్యూ, ఎస్ఈబీ అధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకొన్నారు. అయితే సీజ్ చేసిన వాహనాలు ఏమయ్యాయో ఇప్పటికీ అర్థం కావడం లేదు. ఎందుకు పట్టుకున్నారో, ఎందుకు వదిలేశారో కూడా మిస్టరీగా మారింది.



చిన్నదాసరిపల్లె వద్ద గ్రావెల్ కోసం అక్రమ తవ్వకాలు జరిపే ప్రాంతం



పగడాలపల్లె వద్ద ఉన్న ఇసుక డంప్

కఠిన చర్యలు తీసుకుంటాం..

మండలంలో ఎక్కడా గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు లేవు. అలాగే పాపాఘ్ని నదిలో అనుమతులు ఉన్నచోటనే ఇసుక తవ్వకాలు జరుపుకోవాలి. అలా కాకుండా అక్రమ తవ్వకాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తాం.

- ఉదయభాస్కర్‌రాజు, తహశీల్దార్, పెండ్లిమర్రి

డెమో రైలు రేణిగుంట వరకు పొడిగింపు

కడప (ఎడ్యుకేషన్), జనవరి 11: నంద్యాల-కడప-నంద్యాల డెమో రైలు (07284/07285) రేణిగుంట వరకు పొడిగించినట్లు కడప రైల్వే చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ ఉమర్‌బాషా, సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్ తెలిపారు. ఈ రైలు 13వతేదీ నుంచి రేణిగుంట వరకు నడవనుందన్నారు. నంద్యాల, బనగానపల్లె, కోయిలకుంట్ల, నొస్సం, ఉప్పలపాడు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, కమలాపురం, కడప, ఒంటిమిట్ట, ఓబులవారిపల్లె, కోడూరు మీదుగా రేణిగుంటకు చేరుతుందన్నారు. నంద్యాలలో ఉదయం 5.40కి బయల్దేరి జమ్మలమడుగుకు 7.10, ఎర్రగుంట్లకు 8, కడప 8.45, రాజంపేట 9.45, రేణిగుంటకు మధ్యాహ్నం 12.40గంటలకు చేరుకోనుంది. అలాగే తిరుగు ప్రయాణంలో రేణిగుంటలో మధ్యాహ్నం 1.45కు బయల్దేరి కోడూరు 2.20, కడప సాయంత్రం 5గంటలు, నంద్యాలకు రాత్రి 9గంటలకు చేరుకుంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే..
సీఎం కుర్చీ లాగేస్తాం..

● హెచ్చరించిన అంగన్వాడీలు ● జిల్లా వ్యాప్తంగా కొనసాగిన నిరసనలు



జమ్మలమడుగులో నెత్తిన కుర్చీలతో అంగన్వాడీల ఆందోళన

కడప, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చూపితే వచ్చే ఎన్నికల్లో సీఎం కుర్చీ లాగేస్తామని అంగన్వాడీలు హెచ్చరించారు. న్యాయమైన తమ డిమాండ్లు తీర్చాలంటూ అంగన్వాడీల చేపట్టిన సమ్మె 31వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా గురువారం జమ్మలమడుగు ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ తలపై కుర్చీలు పెట్టుకుని నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దిశగా తాము ఐకమత్యంతో ముఖ్యమంత్రి కుర్చీ లాగేసుకుంటామని, ఈసారి జగన్‌కు పతనం తప్పదని అన్నారు. ప్రొద్దుటూరలోట తహశీల్దారు కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి శివాలయం సర్కిల్లో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. బద్వేలులో మెడలకు ఉరితాళ్లతో నిరసన తెలిపారు. కడపలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన కొనసాగించారు. ఎర్రగుంట్ల, చాపాడు, మైదుకూరు, పోరుమామిళ్లలో అంగన్వాడీల ఆందోళన కొనసాగింది.



ప్రొద్దుటూరులో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న అంగన్వాడీలు

కలర్‌ఫుల్ : రంగులమయమైన నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని టెన్నిస్ కోర్టు



హరివిల్లు.. సిరిజల్లు..

వైభవంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

"ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్‌బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్స్ స్వర్గసీమ సుకేతన" ఫైనల్స్ గురువారం విజయవాడలో అంగ'రంగుల' వైభవంగా జరిగాయి. బెంజిసర్కిల్ సమీపంలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీ టెన్నిస్ కోర్టులో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల స్థాయిలో విజేతలుగా నిలిచిన మహిళలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కూడా పాల్గొన్నారు. తమ సృజనతో ముత్యాల ముగ్గుల్లో రంగుల దృశ్యాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ ఏజీఎం జీవీ నరసింహారావు, కెనరా బ్యాంక్ మార్కెటింగ్ సర్కిల్ సీనియర్ మేనేజర్ శిరీష, 'ఆంధ్రజ్యోతి' న్యూస్ ఎడిటర్ నాగసుధాకర్, 'ఆంధ్రజ్యోతి' విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ, ఏబీఎన్ ఏపీ బ్యూరో బి.రామారావు, యాడ్స్ ఏజీఎం టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, మల్లెల శుభప్రద వ్యవహరించారు. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

ప్రథమ బహుమతి గెలుచుకున్న విజయనగరం జిల్లా మహిళ

గుంటూరు, అనంతపురం, తమిళనాడు మహిళలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



పరిశీలన : ముగ్గులను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

రెండుసార్లు రాష్ట్రస్థాయి బహుమతి పొందా..



నేను టైలరింగ్ చేస్తాను. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నప్పటి నుంచీ పాల్గొంటున్నా. హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించాను. తర్వాత 2023లో నిర్వహించిన పోటీల్లో రెండోసారి ప్రథమ బహుమతిని పొందాను. మళ్లీ ఇప్పుడు ద్వితీయ బహుమతి పొందా.

- కె.ఉమాదేవి, అనంతపురం జిల్లా

ద్వితీయ బహుమతి విజేతలు

ఐదేళ్లుగా ముగ్గులు వేస్తున్నా



మాది సత్తెనపల్లి వద్ద ఉన్న ధూళిపాళ్ల గ్రామం. ఐదేళ్లుగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. జిల్లాస్థాయి పోటీల్లో రెండుసార్లు ప్రథమ బహుమతి సాధించాను. 2020లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ మొదటి స్థానం నాదే.

- ఏ.సునీత, గుంటూరు జిల్లా

పదేళ్లుగా పోటీల్లో ఉంటున్నా..



కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో ఏటా నేను పాల్గొంటా. పదేళ్లుగా నేను ముగ్గులు వేస్తున్నా. తొలిసారిగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈ పోటీల్లో ద్వితీయ బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది.

- రాధ, తమిళనాడు



విజేతలు వీరే.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నుంచి ద్వితీయ బహుమతులు అందుకుంటున్న ఏ.సునీత (గుంటూరు), కె.ఉమాదేవి (అనంతపురం), కె.రాధ (తమిళనాడు), కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న ఆర్.ఆశాజ్యోతి (శ్రీకాకుళం), బి.లక్ష్మి (విశాఖపట్నం), టి.ఆదిశ్రీ (పశ్చిమగోదావరి), మల్లీశ్వరి (తూర్పుగోదావరి), పి.పూజిత (కృష్ణా), ఎం.సునీత (నెల్లూరు), సీహెచ్ మణిమంజరి (ప్రకాశం), విద్య (చిత్తూరు), ఎస్.శ్వేత (కడప), ఎస్.రాజేశ్వరి (కర్నూలు), లిఖిత (కర్ణాటక)

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి




కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

కడప (సెవెన్ రోడ్స్), జనవరి 11: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం కడప జిల్లా సమితి పిలుపులో భాగంగా గురువారం కడప కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ మాట్లాడుతూ 20 ఏళ్లగా ప్రభుత్వ పాఠశాలల్లో వంట ఏజన్సీలను నడుపుతున్నారన్నారు. వీరికి ఇప్పటికీ సరైన గుర్తింపు లేదన్నారు. వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నేతలు మద్దిలేటి, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడుతాం'

కడప (ఎడ్యుకేషన్), జనవరి 11: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నిరద్యోగులకు ఏటా జనవరిలో జాబ్‌క్యాలెండరు, మెగా డీఎస్సీ విడుదల చేస్తామని నమ్మబలికి అధికారం చేపట్టిన సీఎం వైఎస్ జగన్ మోసగించారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం విడుదల చేయకుంటే రాబోయే ఎన్నికల్లో వైసీపీ చరమగీతం పాడుతామని విద్యార్థి, యువజన సంఘం నేతలు హెచ్చరించారు. గురువారం కడప నగరం ప్రగతి నర్సింగ్ హోం లో నిర్వహించిన సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్, ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజేంద్రప్రసాద్, జిల్లా కార్యదర్శి గండి సునీల్‌కుమార్, పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కొమ్మలపాటి సుబ్బరాయుడు, ఏఐఎస్‌బీ రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిళ్ల బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో సగటున రోజుకు ఒక నిరుద్యోగి చొప్పున నాలుగేళ్లలో 1345మంది నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకు న్నార న్నారు. బుధవారం బిమఠం మండలంలో పాపిరెడ్డిపల్లె చెందిన శ్రీనాధ్ ఆత్మహత్య చేసుకున్న విషయం గుర్తు చేశారు. తక్షణం డీఎస్సీ విడుదల చేయాలని లేదంటే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

ట్రాక్టర్ బోల్తా ఒకరు మృతి



వెంకటేష్ మృతదేహం

ఓబులవారిపల్లె, జనవరి 11: మండలంలోని వై.కోట గ్రామ పంచాయతీ వెంకటేశ్వరపురం ఎస్టీ కాలనీలో బుధవారం రాత్రి ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడటంతో అదే కాలనీకి చెందిన గిలకాపటి వెంకటేష్ (22) మృతి చెందాడు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల మేరకు... వై.కోట గ్రామానికి చెందిన చంద్ర అనే వ్యక్తి వద్ద వినీత్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసేవాడు. వెంకటేష్ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. వీరిద్దరు బుధవారం సాయంత్రం ట్రాక్టర్‌తో ఎర్రమట్టి తలించేందుకు వెళ్లారు. పని ముగియగానే ట్రాక్టర్‌ను యజమాని ఇంటి వద్ద పెట్టేందుకు వెళుతుండగా ట్రాక్టర్ అదపు తప్పి బోల్తా పడటంతో టైర్ కింద పడ్డ వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ వినీత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇతన్ని 108 అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించారు.

మృతుడు వెంకటేష్‌కు భార్య ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్ద వెంకటేష్ మృతితో నిరుపేద కుటుంబం దిక్కు లేనిది అయ్యిందని.. ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పారదర్శక ఓటర్ల జాబితాకు కృషి చేయాలి

● జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 11: జిల్లాలో పారదర్శకంగా జాబితా రూపొందించడానికి కృషి చేయాలని, ప్రభుత్వ పథకాల్లో లక్ష్యాలను సాధించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం విజయవాడ సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి సార్వత్రిక ఎన్నికలు, వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ, పంచాయతీ రాజ్, ఉపాధి హామీ పథకం, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, మహిళా శిశు సంక్షేమం, అసైన్డ్ భూములు, హౌసింగ్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి సమీక్షించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫిరెన్స్ హాలు నుంచి జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌వో సత్యనారాయణ పాల్గొన్నారు. వీడియో కాన్ఫిరెన్స్ అనంతరం అధికారులతో జేసీ మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణలో భాగంగా అభ్యంతరాలపై అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. బీఎల్‌ఈ, ఈఆర్‌వో లాగిన్‌లో ఏడు రోజులు పైబడిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ దశ క్యాంపులను పటిష్ఠంగా నిర్వహించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. ఉపాధి హామీలో నేరుగా లక్ష్యాలను పూర్తి చేయాలని, మూడో దశ రీసర్వే పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కార్మికులపై ఎస్మా ఎత్తి వేయాలి

● ప్రజా సంఘాల డిమాండ్



అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

కడప (సెవెన్ రోడ్స్), జనవరి 11: అంగన్వాడీల వేతనాలు పెంచాలని, ఎస్మా చట్టాన్ని ఎత్తివేయాలని, జీఓ నెం.2 రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం అంబేద్కర్ సర్కిల్ వద్ద ప్రజా సంఘాల నేతలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెలరోజులుగా అంగన్వాడీలు ప్రజాస్వామ్య పద్ధతిలో వేతనాలు పెంచాలని, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం విధుల్లో చేరాలని బెదిరించడం దుర్మార్గమన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరడం తప్పా అన్నారు. అంగన్వాడీ, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీపీఎం సీనియర్ నేత నారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శివకుమార్, అన్వేష్, టీడీపీ అధికార ప్రతినిధి బాలదాసు, సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ, సీపీఐ ఎంఎల్ జిల్లా నేత డబ్బురాము, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దస్తగిరిరెడ్డి, బీసీ సంఘం జిల్లా కన్వీనరు అవ్వారు మల్లికార్జున, హేతువాద సంఘం జిల్లా కన్వీనరు సీఆర్వీ ప్రసాద్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గురప్ప, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సునీల్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నరసయ్య, లోక్‌సత్తా, ఆర్‌పీఎస్, ఫార్వర్డ్ బ్లక్, మహానాడు, రైతు కూలి సంఘం నేతలు దేవరక్రిష్ణ, సుబ్బరాయుడు, జయవర్ధన్, రాజు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రత్యేక దృష్టి సారించాలి : కలెక్టర్

కడప(కలెక్టరేట్) జనవరి 11: జిల్లాలో అన్ని రకాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ క్యాంపు కార్యాలయం నుంచి హౌసింగ్, రెవెన్యూ, పంచాయితీరాజ్ అన్ని రకాల సంక్షేమ పథకాల అమలు తీరుపై కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తో పాటు నగర కమిషనరు ప్రవీణ్‌చంద్, డీఆర్వో గంగాధర్‌గౌడ్ పాల్గొన్నారు. సీఎస్ వీసీ ముగిసిన అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అంత్యంత ప్రాధాన్యత నిస్తున్న గ్రామ సచివాలయాలు, రైతుభరోసా, అంగన్వాడీ, వైఎస్సార్ క్లినిక్‌లు తదితర ప్రభుత్వ శాశ్వత భవన నిర్మాణాలపై దృష్టి సారించి వెంటనే పనులు పూర్తి చేయాలన్నారు. జిల్లా అధికారులు సుధాకర్ రెడ్డి, వెంకట్రావు, శ్రీలక్ష్మి, కృష్ణయ్య, ప్రభాకర్‌రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సురభి నాటకాలను విజయవంతం చేయాలి

పులివెందుల, జనవరి 11: సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని పులివెందులలో ఏర్పాటు చేసిన ప్రఖ్యాత సురభి నాటకోత్సవాలను విజయవంతం చేయాలని పాడా ఓఎస్డీ అనిల్ కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక నగరవనం వద్ద సురభి నాటకోత్సవాల బ్రోచర్లను ఆర్డీఓ వెంకటేశులుతో కలిసి ఆవిష్కరించిన ఓఎస్డీ మాట్లాడుతూ 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్వహించే నాటకోత్సవాలను కుటుంబ సమేతంగా విచ్చేసి ఆనందించాలని కోరారు. నాటకం అంటే సురభి.సురభి అంటే నాటకం అనేలా ప్రఖ్యాతిగాంచిన నాటకోత్సవాలను వినాయక నాట్యమండలి ఆధ్వర్యంలో గరండాల రివర్ ఫ్రంట్‌లో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్, డీఆర్‌డీఏ ఏపీ నీలకంఠారెడ్డి, ఎంపీడీఓ కార్యాలయ అధికారి జనార్ధన్‌రెడ్డి, సీసీ టు ఆర్డీఓ కేశవ తదితరులు పాల్గొన్నారు.

పన్ను లేని ఐటీ పరిమితి పెంచాలి : ఏపీటీఎఫ్

కడప (ఎడ్యుకేషన్), జనవరి 11: పెరిగిన ధరలకనుగుణంగా పన్ను చెల్లింపు లేని పరిమితి పెంచాలని ఏపీటీఎఫ్ అమ రావతి నేత సీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం కడప నగరం ఏపీటీఎఫ్ అమరావతి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి మార్పునకు నోచుకోని పన్ను లేని పరిమితిని రూ.7లక్షల వరకు పూర్తిగా అమలు పరచాలని డిమాండ్ చేశారు. పొదుపును ప్రోత్సహించే విధంగా సెక్షన్ 80సీ కింద కనీస పరిమితి రూ.2లక్షలకు పెంచాలని కోరారు. సీపీఎస్ చెల్లింపులు ప్రత్యేక సెక్షన్ పరిధిలోకి తీసుకురావాలన్నారు. సమావేశంలో పలువురు మం డలాల కార్యకర్తలు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్య కోర్సుల్లో ఉచిత శిక్షణ

కడప (ఎడ్యుకేషన్), జనవరి 11: ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ సౌజన్యంతో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ద్వారా జిల్లాలోని నిరుద్యోగ యువతకు నైపుణ్యవృత్తి విద్యాకోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ రీజనల్ కోఆర్డినేటర్ ఎన్.సుబ్బరామిరెడ్డి తెలిపారు. సోలార్ టీవీ ఇన్‌స్టాలర్, సూర్యమిత్ర, సోషల్ మీడియా, ఎగ్జిక్యూటివ్, ఫ్రంట్ ఆఫీసు అసోసియేట్ అసిస్టెంటు బ్యూటీ థెరపి, ప్రొడక్షన్ మిషన్ ఆపరేటర్ రిటైల్ సేల్స్ అసోసియేట్ జనరల్ డ్యూటీ అసిస్టెంటు, లైట్ మోటారు వెహికల్ డ్రైవరు కోర్సుల్లో శిక్షణ కల్పిస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన వారు జిల్లాలో కోర్టు ఎదురుగా, స్మిత్ రోడ్డులో ఉన్న తమ శిక్షణ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 90 రోజుల పాటు ఉచిత శిక్షణ, గుర్తింపబడిన సర్టిఫికెట్ ఇస్తారన్నారు. శిక్షణ అనంతరం అర్హతను బట్టి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నలభై ఏళ్ల పాలనను మరిపిస్తా

ఒక్క అవకాశం ఇవ్వమనికోరిన బీటెక్ రవి ● రాష్ట్రంలో పేట్రేగుతున్న అరాచక పాలన
● బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి, జనసేన జిల్లా కన్వీనరు సుంకర శ్రీనివాస్

పులివెందుల టౌన్, జనవరి 11: ఒక్కసారి అవకాశం ఇస్తే నలభై ఏళ్ల పాలనను మరిపిస్తానని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. గురువారం బీటెక్ రవి ఆయన సతీమణి లతారెడ్డి బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. జగన్ మోహన్‌రెడ్డి రాక్షసపాలన చేస్తున్నారని దానికి చరమ గీతం పాడి మంచిపాలనను తెచ్చుకుందాం టీడీపీకి ఓటు వేయండి అంటూ ప్రజలను అడిగారు. వైఎస్ జగన్ ఒక్కచాన్స్ అని చెప్పి ప్రజాస్వామ్య వ్యతిరేక పాలన చేస్తున్నారన్నారు. టీడీపీ నేతలు జోగిరెడ్డి, వెంకటరామిరెడ్డి, సిద్దారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, మైసూరారెడ్డి, ఆకుల ప్రసాద్, మహబూబ్ బాష, ఖాసీం వల్లి, విజయ్‌కుమార్‌రెడ్డి, బాబు, యేమిరెడ్డి, గంగాధర్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, అనసూయ, బీబీ, అరుణ, దేవి, కుమారి, లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

కడప (ఎడ్యుకేషన్), జనవరి 11: రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, కడప ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి, జనసేన కడప జిల్లా కోఆర్డినేటర్ సుంకర శ్రీనివాస్ అన్నారు. గురువారం కడప నగరం ఐదో డివిజన్ అశోక్‌నగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు. జనసేన, టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే అభివృద్ధి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లాలో అరాచకం ఎక్కువైందని, వైసీపీ నేతలు భూ ఆక్రమణలు, పాటు ఇసుక మాఫియా చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. దీనిని కట్టడిచేయాలంటే టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం రావాలసిన అవసరం ఉందన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

టీడీపీ, జనసేన కార్యకర్తలకు అండగా నిలుస్తామని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, జనసేన జిల్లా కోఆర్డినేటరు సుంకర శ్రీనివాస్ తెలిపారు. గురువారం చలమారెడ్డిపల్లె టీడీపీ కార్యకర్త హనుమంతు ఇంటికి వెళ్లి పరామర్శించిన వారు మాట్లాడుతూ నగరంలో వైసీపీ అండదండలతో అరాచకాలు మితిమీరుతున్నాయన్నారు. కార్యకర్తలు భయపడాల్సిన అవసరం లేదని, అందరికీ అండగా ఉంటామని భరోసా కల్పించారు.

చెన్నూరు, కొండపేట, కనుపర్తి గ్రామాల్లో....

చెన్నూరు, జనవరి 11: రాష్ట్రంలో ప్రజలందరి బాగు కోసం టీడీపీని గెలిపించుకుందామని చంద్రబాబు సీఎం అయితేనే అందరం బాగుంటామని మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, కొండపేట, కనుపర్తి సీనియర్ నేతలు, మాజీ సర్పంచ్‌లు ఎం.మోహన్ రెడ్డి, ఆర్.సుధాకర్‌రెడ్డి, లేవాకు విజయ ప్రతాప్‌రెడ్డి, ఓ.విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మండల కన్వీనరు మాట్లాడుతూ రాష్ట్రంలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు బాగుపడతామన్న కల వైసీపీ పాలనలో లేకుండా పోయిందన్నారు. అన్ని రకాల వర్గాలు ఉద్యోగులు సైతం టీడీపీ కావాలని బలంగా కోరుకుంటున్నారని ఇటీవల జరుగుతున్న పరిణామాలే ఇందుకు నిదర్శనమన్నారు. వైసీపీ మునిగిపోయే నావ వంటిదని, ఆ పార్టీ నేతలే అక్కడ ఉండలేక ఆ నేతల టార్చర్ భరించలేక వారు పనులు చేసినా బిల్లులు రాక వెనుదిరిగారని ఒక్కొక్కరుగా టీడీపీ, జనసేన వైపు చూస్తున్నారన్నారు. చివరికి గ్రామ పంచాయతీల్లో చిన్నపాటి పనులు చేసినా సర్పంచ్‌లు నిధులు లేక అలంకార ప్రాయంగా కుర్చీలకే పరిమితమై ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రజల్లోకి వెళితే ఏం జవాబు చెప్పాలో తెలియని పరిస్థితుల్లో ఇళ్లకే పరిమితమయ్యారన్ని అప్పు చేసి పెట్టిన ఖర్చు కూడా రాని పరిస్థితన్నారు. చంద్రబాబును గెలిపించి టీడీపీతో సంక్షేమ అభివృద్ధి అందుకోవాలన్నారు. అనంతరం సూపర్‌సిక్స్‌తో ఎలాంటి ప్రయోజనాలో ఇంటింటికీ వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బిట్టి ఆది, యువనేత సంజీవ్ పవన్, మాజీ సర్పంచ్‌లు బాషా, సాదక్, ఉప సర్పంచులు ఖాసింపీరా, మాబు, మైనార్టీ నేత షబ్బీర్‌హుసేన్ తదితరులు పాల్గొన్నారు.



పులివెందులలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీలో మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి - కడపలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జి మాధవీరెడ్డి, జనసేన నేత సుంకర శ్రీనివాస్ - కొండపేటలో....

'రా... కదలిరా' విజయవంతం చేయండి

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్.గోవర్ధన్‌రెడ్డి

కడప (ఎడ్యుకేషన్), జనవరి 11: రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటుకు ప్రజలు సహకరిస్తే సుపరిపాలన అందిస్తామని టీడీపీ అధినేత పిలుపునిచ్చిన 'రా... కదలిరా...' కార్యక్రమం విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ఎస్.గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కడప తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో విధ్వంస పాలన కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు సభలకు వస్తున్న జనాదరణ చూసి సీఎం జగన్ వణుకుతున్నారన్నారు. జిల్లాలో ప్రజల స్పందన చూస్తే అన్ని స్థానాలనూ కైవశం చేసుకుంటామని, టీడీపీ జనసేన కూటమి అధికారంలోకి వస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. వైసీపీ అవినీతికి భయపడి ఉన్న పరిశ్రమలు కూడా మూసివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక, గ్రానైట్ పేరుతో రాష్ట్రంలో వైసీపీ విధ్వంసం సృష్టిస్తోందన్నారు. వైసీపీ నుంచి రాష్ట్రాన్ని కాపాడేది టీడీపీనేనని, ప్రజలు టీడీపీకి మద్దతు నివ్వాలన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపునిచ్చిన రా కదలిరా కార్యక్రమం రాష్ట్ర భవిష్యత్తును మారుస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో నిర్వహిస్తున్నామని, ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గురప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆర్తిహోంలో చిరుధాన్యాల వంటకాల ప్రదర్శన



బహుమతులు అందిస్తున్న ఆర్తిహోం ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), జనవరి 11: కడప నగరం ఆర్తి హోంలో గురువారం చిరుధాన్యాల వంటకాల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో నగర ప్రజలు ఉత్సాహంగా పాల్గొని వివిధ రకాల వంటలు వండి ప్రదర్శించారు. సంస్థ ఛైర్మన్ సంధ్య మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా రాజు, భద్రావతి, శైలజ, కె.స్నేహలత, భాగ్యమ్మ హాజరయ్యారన్నారు. వంటల పోటీల్లో పాల్గొన్న లావణ్య, ప్రసన్న, యాస్మిన్‌ను ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. ప్రథమ బహుమతిగా రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.4వేలు, తృతీయ బహుమతి రూ.3వేలు అందించారు. మరో ఐదుగురిని స్పెషల్ ప్రైజ్‌లకు ఎంపిక చేసి ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున బహుమతిని అందించారని తెలిపారు. కార్యక్రమంలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఎస్మా ప్రయోగం అవివేకం : సీఐటీయూ

31వ రోజుకు చేరిన అంగన్వాడీల నిరసన



రిలేదీక్షల్లో కూర్చున్న అంగన్వాడీ నేతలు

కడప (నాగరాజుపేట), జనవరి 11: విధిలేని పరిస్థితుల్లో ఉద్యోగం చేసే అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగం చేయడం అవివేకమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, సీఐటీయూ నగర కార్యదర్శి చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి మనోహర్, అంగన్వాడీ నేతలు లక్ష్మీదేవి, మంజుల అన్నారు. న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం 31 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తున్నా ఇంత వరకూ ప్రభుత్వం స్పందించకపోగా కార్మికులపై ఎస్మా చట్టం ప్రయోగించడం అన్యాయమన్నారు. చిన్న పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి వారికి చదువుపై ఆసక్తి కల్పించే విధంగా అంగన్వాడీలు ప్రోత్సహిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలకు కనీస వేతనాలు కూడా ఇవ్వకుండా సమ్మె చేస్తున్న వారిపై ఎస్మా చట్టం ప్రయోగించి సమ్మెను అణచివేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఇది దుర్మార్గపు చర్య అన్నారు. ఇప్పటికైనా ప్రభు త్వం అంగన్వాడీ నేతలతో చర్చించి చర్చలు జరిపి కనీస వేతనంగా రూ.26వేలకు పెంచి గ్రాట్యుటీ అమలు చేసి ప్రీస్కూళ్లను మెయిన్ సెంటర్లలో కలపాలని ఇంకా పలు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంత వరకూ సమ్మెను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపమన్నారు. కార్యక్రమంలో సంఘీభావంగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులరెడ్డి, ఏఐటీయూసీ నగర కార్యదర్శి మద్దిలేటి, డీవైఎఫ్ఐ డీఎం ఓబులేసు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సునీల్, అంగన్వాడీ వర్కర్ల యూనియన్ నేతలు దీపా, వెన్నెల, అనిల్ సీఐటీయూ నేతలు పవన్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

పంతాలకు పోకుండా సమ్మెను విరమింపజేయండి

సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్

కడప (నాగరాజుపేట), జనవరి 11: రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి పండుగను దృష్టిలో పెట్టుకుని పంతాలకు పోకుండా అంగన్వాడీ సమ్మెను విరమింపజేయాలని సీపీఎం కడప నగర కార్యదర్శి రామ్మోహన్ విజ్ఞప్తి చేశారు. గురువారం సీపీఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నెలరోజులుగా అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, మినీ వర్కర్లు తమ సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున పోరాటం చేస్తుంటే ప్రభుత్వం సమస్యను సానుకూలంగా పరిష్కరించకపోవడం సమంజసం కాదన్నారు. సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకుని వారి వేతనాలు పెంపునకు ప్రభుత్వం చొరవ తీసుకుని సమస్యను పరిష్కారించాలని ఆయన డిమాండ్ చేశారు. తక్షణమే చర్చలు జరిపి సమ్మెను విరమింపజేయకపోతే ఈ పోరాటం మరింత తీవ్రతరం అవుతుందన్న విషయాన్ని ప్రభుత్వ పెద్దలు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

అయోధ్యరామయ్య అక్షింతల పంపిణీ



ఇంటింటికీ అక్షింతల పంపిణీలో వెంకటరమణ

కడప (కల్చరల్) జనవరి 11: అయోధ్య రామయ్య ఆలయం నుంచి అక్షింతలు కడపకు రావడం శుభపరిణామమని బీజేపీ నేత వెంకటరణ కొనియాడారు. గురువారం పటేల్ రోడ్డులోని ప్రతి ఇంటికీ స్వామి వారి అక్షింతల పంపిణీ చేపట్టిన ఆయన మాట్లాడుతూ 22న అయోధ్య రామాలయంలో ప్రాణ ప్రతిష్ఠ జరుగనున్న నేపథ్యంలో సీతారాముల వారి అక్షింతలు దేశ వ్యాప్తంగా ప్రతి గడపకూ చేరాలనే ధ్యేయంతో రామయ్య స్వామివారి అక్షింతలు మన కడప నగరానికి చేరుకున్నట్లు వెల్లడించారు. బీజేపీ నేతలు లక్ష్మీనారాయణరెడ్డి, మహిళా నేత చేపూరి శారదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు బయోమెట్రిక్ తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎస్ఓ

వల్లూరు, జనవరి 11: ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా హాజరును బయోమెట్రిక్ ద్వారా వేయాలని వల్లూరు మండల ఎంఎస్ఓ బ్రహ్మయ్య అన్నారు. గురువారం ఎంపీడీఓ సభాభవనంలో ఎంపీడీఓ జయశ్రీ ఆధ్వర్యంలో మండల స్థాయి, సచివాలయ ఉద్యోగులతో ఆయన మాట్లాడుతూ రాను రాను సచివాలయంలో ఉద్యోగులు బయోమెట్రిక్ వేయడం లేదన్నారు. నిబంధనల ప్రకారం ఖచ్చితంగా బయోమెట్రిక్ వేస్తేనే వారు జీతాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. గృహ నిర్మాణ శాఖ కేటాయించిన పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. మండల స్థాయిలో జరుగుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. డిప్యూటీ తహసీల్దార్ సుహాసిని, పంచాయతీ విస్తరణాధికారి ప్రసాద్, ఏఈలు ముజీబ్, పవన్‌కుమార్, ఏపీఎం శైలజ, ఉపాధి, విద్య, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సచివాలయంలో అంగన్వాడీ ఆహారం పంపిణీ



సచివాలయంలోనే పంపిణీ చేస్తున్న దృశ్యం

వేముల, జనవరి 11: అంగన్వాడీ కేంద్రాల్లో పంపిణీ చేయాల్సిన పౌష్టికాహారాన్ని సచివాలయంలో పంపిణీ చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీల సమ్మెతో బాలింతలకు, గర్భిణులు, చిన్నపిల్లలు ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయంగా పౌష్టికాహార సరుకులను సచివాలయ సిబ్బంది ద్వారా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా కోడిగుడ్లు, పౌష్టికాహార సరుకులను అందించాలని ఆదేశాలున్నా వేములలో మాత్రం సచివాలయం నుంచే పంపిణీ చేస్తున్నారు. దీనిపై గర్భిణులు, బాలింతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అంగన్వాడీ సిబ్బంది సరుకులను బాలింతలు, గర్భిణులకు ఇళ్లకే చేరువేస్తుండే వారని, సచివాలయ సిబ్బంది మాత్రం ఇక్కడికే రావాలని ఆదేశాలు జారీ చేస్తున్నారంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీడీపీఓను వివరణ కోరగా సచివాలయం నుంచి పంపిణీ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, సెంటర్లకు సరుకులను చేర్చేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓకు తెలియజేశామన్నారు.

ఆర్కిటెక్చర్ యూనివర్సిటీలో ముందస్తు సంక్రాంతి



భోగిమంట వెలిగిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

కడప (ఎడ్యుకేషన్), జనవరి 11: డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని వైస్‌చాన్సలర్ అంజనేయ ప్రసాద్, రిజిస్ట్రార్ సురేంద్రనాథరెడ్డి ప్రారంభించారు. భోగి మంటలు వెలిగించి సంక్రాంతి లక్ష్మితో పూజలు చేసి పండుగను ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు ప్రజలకు సంక్రాంతి ఎంతో ముఖ్యమైనదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్, సూపరింటెంఎంట్ పవన్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైవీయూలో వైద్యశిబిరానికి విశేష స్పందన

కడప (ఎడ్యుకేషన్), జనవరి 11: బోధన, పరిశోధన సేవా అనే ప్రధాన లక్ష్యంతో ముందుకు వెళుతున్న వైవీయూ సమాజ సేవలో నిత్యం భాగస్వామ్యం అవుతోందని వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ తెలిపారు. గురువారం వైవీయూలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉచిత నిర్వహించిన వైద్య శిబిరంలో ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ద్వారా నిత్యం యూనివర్సిటీలో ప్రజాపయోగ కార్యక్రమం చేపడుతోందన్నారు. వైవీయూ సేవలు పల్లెలకు విస్తరిస్తున్నాయని తెలిపారు. ప్రిన్సిపాల్ ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ యూనివర్సిటీ అందించే వైద్యసేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇంకెన్నాళ్లు ప్రజలకు తిప్పలు : కాంగ్రెస్

కడప(కలెక్టరేట్) జనవరి 11: రోడ్లు, కాల్వల నిర్మాణాల పేరుతో మూడు నెలలుగా నగర ప్రజలకు నరకం చూపిస్తున్నారని, ఇంకెన్నాళ్లు నిర్మాణాలు సాగదీస్తారంటూ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు వై.విష్ణు ప్రీతం రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం 26వ, 29వ డివిజన్ల పరిధిలో, మాసాపేట నుంచి మార్కెట్ యార్డు సర్కిల్ వరకు జరుగుతున్న పనులు, క్రిష్ణా థియేటర్ వరకు జరుగుతున్న రోడ్ల విస్తరణ పనులను నగర కాంగ్రెస్ అధ్యక్షుడు విష్ణు ప్రీతం రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు పర్యటించి, పనులు జరుగుతున్న తీరును చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, రాష్ట్ర నేతలు అలీఖాన్, మాజీ కార్పొరేటర్ రంతుల్లాఖాన్, లక్ష్మయ్య, పాలగిరి శివ, శ్రీనివాసులు, హబీబ్, శామ్యలా దేవి, రఫీ, వెంకటసుబ్బమ్మ, సులోచన మామిళ్లబాబు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఆప్ కృషి

వేంపల్లె, జనవరి 11: ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఆమ్‌ఆద్మీ పార్టీ కృషిచేస్తోందని ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో ముందుంటామని జిల్లా కోఆర్డినేటర్ రహంతుల్లా, దాదాపీర్ తెలిపారు. వేంపల్లెలో పలువురు యువకులు ఆ పార్టీలో చేరారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేస్తున్నారు అభివృద్ధి కనపడడం లేదని దుయ్యబట్టారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న చైతన్యరెడ్డి

వల్లూరు, జనవరి 11: సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఎ.ఓబాయపల్లె ప్రీమియర్ క్రికెట్ లీగ్ పోటీలను గురువారం యువనేత క్రిష్ణచైతన్యరెడ్డి ప్రారంభించారు. ఒక మంచి భావన, స్నేహదయంతో సోదర భావంతో క్రికెట్ ఆడాలని సూచించారు. గెలుపోటములు సాధారణమని, ఆటలో స్ఫూర్తి చాటాలన్నారు. ప్రతి విజేతకు మొదటి బహుమతి రూ.50వేలు, రెండో బహుమతి రూ.30వేలు ఉంటుందన్నారు. వీరి వెంట వల్లూరు టీడీపీ మండల అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, అచ్చింతాయపల్లె క్రికెట్ లీగ్ నిర్వహకులు చెన్నారెడ్డి, వెంకట సుబ్బయ్య నేతలు మదన్‌మోహన్‌రెడ్డి, ఓబులేసు, సాయి, సుమన్, రాజేష్, పుత్తా అభిమానులు, అనుచరులు పాల్గొన్నారు.

అన్నదానం మహా పుణ్యకార్యం

కడప (కల్చరల్) జనవరి 11: అన్నదానం మహా పుణ్యకార్యమని జేబీవీఎస్.ది ప్రిజర్వర్ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు అశోక్ పేర్కొన్నారు. వివిధ జబ్బుల బారిన పడి రిమ్స్‌లో వైద్యసేవలందుకుంటున్న రోగులకు, అటెండర్లకు అన్నదానం నిర్వహించారు. మానవ సేవే లక్ష్యంగా పేదలకు కాసింత్తైనా సాయం చేయాలనే ధ్యేయంతో ముందుకు సాగుతున్నామన్నారు. మునుముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

లింగాల, జనవరి 11: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 11:00గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుదని విద్యుత్ ఏఈ రమేష్‌బాబు తెలిపారు. 132/33కెవి లింగాల సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తులు కారణంగా లింగాల, చిన్నకుడాల, గుణకనపల్లె, తాతిరెడ్డిపల్లె, కోమన్నూతల, వెలిదండ్ల, పార్నపల్లె సబ్‌స్టేషన్‌ల పరిధి గ్రామాల్లో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆయన గురువారం ఒక ప్రకటనలో కోరారు.


17న శ్రీకృష్ణదేవరాయలు జయంతి

కడప (కల్చరల్) జనవరి 11: కడప నేక్‌నామ్ కళాక్షేత్రంలో 17వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణదేవరాయలు 533వ జయంతి వేడుకలు కన్నులపండువగా జరుగనున్నట్లు ఆర్టీసీ కడప డిపో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కార్యదర్శి నగినాల శ్రీనివాసులు తెలిపారు. దేశ భాషలందు తెలుగు లెస్స అని చాటి చెప్పిన తెలుగు వల్లభుడుగా శ్రీకృష్ణదేవరాయలు ఖ్యాతిగాంచారని గుర్తుచేశారు. అలాంటి మహనీయులను స్మరించుకునేందుకు జిల్లాలోని బలిజలు పెద్ద సంఖ్యలో తప్పక హాజరు కావాలని కోరారు.

విజేతలను ప్రకటించిన ఎంపీడీఓ

చెన్నూరు, జనవరి 11: మండల వ్యాప్తంగా ఇటీవల జరిగిన ఆటల పోటీల్లో విజేతలను ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ ప్రకటించారు. క్రికెట్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్‌కు బాలురు, బాలికల విజేతలను ఆయన ప్రకటించారు. క్రికెట్‌లో బయనపల్లె నుంచి బాలురు, బలసింగాయపల్లె నుంచి బాలికలు, ఖోఖో చెన్నూరు 1, గుర్రంపాడు, వాలీబాల్ చెన్నూరు 3, చెన్నూరు 3, కబడ్డీ బయనపల్లె, బలసింగాయపల్లె, బ్యాడ్మింటన్ చెన్నూరు 2, ఉప్పరపల్లెలో విద్యార్థులను విన్నర్లగా ప్రకటించినట్లు తెలిపారు. వీరంతా జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.

ప్రజా సంక్షేమం కోసం బీసీవైపీ



విలేకరులతో మాట్లాడుతున్న పండిట్ డేవిడ్

కడప (ఎడ్యుకేషన్), జనవరి 11: బడుగుల జీవన విధానంలో మార్పుల కోసం రైతుల ఆకాంక్షలకనుగుణంగా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బీసీవైపార్టీ ఆవిర్భవించినట్లు రాష్ట్ర సమన్వయ కర్త పండిట్ డేవిడ్ తెలిపారు. గురువారం కడప నగరం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనంతపురంలో జరిగిన రాయలసీమ గర్జనకు సీమ ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. బద్వేలు నియోజకవర్గం నుంచి తాను బరిలో నిలిచేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కడుపు కాలిన అంగన్వాడీలు ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సమావేశంలో జిల్లా సమన్వయ కర్త శివప్రసాద్, ఇస్రోమ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ భూ హక్కుల చట్టం రద్దయ్యే వరకు పోరుబాట

● భారత న్యాయవాదుల సంఘం హెచ్చరిక



నిరసన చేపడుతున్న న్యాయవాదులు

కడప (రూరల్) జనవరి 11: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఏపీ ల్యాండ్ టైటలింగ్ యాక్టు(భూ హక్కు చట్టం) 2023ను రద్దయ్యే వరకు భారత న్యాయవాదుల సంఘం రాజీలేని పోరాటాలు సాగిస్తూనే ఉంటుందని జిల్లా గౌరవాధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి, అధ్యక్షుడు పి. సుబ్రహ్మణ్యం ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం భారత న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో న్యాయవాదులు ఏపీ భూహక్కుల చట్టం రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ కోర్టు గేట్ వద్ద నిరసన చేపట్టిన వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త భూ హక్కు చట్టం వలన ప్రజల భూ హక్కులకు విఘాతం కలిగించేలా ఉందన్నారు. ఈ చట్టం వలన పేదవారికి తీరని అన్యాయం జరగబోతోందన్నారు. సదరు చట్టం రాకమునుపు పేదవారు తమ భూ హక్కులను పొందాలంటే సివిల్ కోర్టులను ఆశ్రయించి న్యాయం పొందే వారని ఇప్పుడు ఈ చట్టం వలన సామాన్య ప్రజలు సివిల్ కోర్టు ద్వారా న్యాయం పొందే వీలుందన్నారు. రాష్ట్రంలోని ప్రజలు తీవ్రమైన సమస్యలను చవిచూడాల్సి వస్తోందన్నారు. ఒక రకంగా చెప్పాలంటే న్యాయవ్యవస్థను బలహీన పరిచేలా ఉందన్నారు. ఇదేకనుక జరిగితే ప్రజాస్వామానికి ప్రమాదం ఏర్పడుతుందన్నారు. స్వాతంత్ర్యం ముందు నుంచి కూడా భూ హక్కు చట్టం, భూహక్కులు నిర్ణయించే హక్కు సివిల్ కోర్టులకే ఉండేదన్నారు. ఇప్పుడు ఏపీ ప్రభుత్వం సివిల్ కోర్టు పరిధి నుంచి తీసేయడం వలన ప్రజలు తగిన న్యాయం పొందలేరన్నారు. ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ హక్కు చట్టం ద్వారా ప్రజల స్థిరాస్తులకు రక్షణ ఉండదని, దీనిని వెంటనే రద్దుచేయాలన్నారు. ఏపీ భూహక్కుల చట్టం వలన కలిగే అనర్థాలను, నష్టాలను ప్రజలు గ్రహించి ప్రభుత్వంపై పోరుబాటను సాగించాలన్నారు. ఈ చట్టం ద్వారా భారత పౌరుని రైట్ టు ప్రాపర్టీ హక్కుకే విఘాతం కలిగే అవకాశం ఉందని కాబట్టి దీనిని వెంటనే నిషేధించాలన్నారు. ఈ చీకటి చట్టం గురించి న్యాయవాదులు చేస్తున్న న్యాయమైన పోరాటాలకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలుపుతున్నారన్నారు. ఆందోళనలు తీవ్రతరం దాల్చకమునుపే ప్రభుత్వం స్పందించి ప్రజల ఆస్తులకు భద్రతలేని ఏపీ ల్యాండ్ టైటలింగ్ యాక్టు 2023(భూ హక్కు చట్టం)ను రద్దు చేయాలని లేని పక్షంలో ఆందోళనలను తీవ్రం చేస్తామని న్యాయవాదులు హెచ్చరించారు. సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఈశ్వర్, నగర అధ్యక్షుడు రామకొండయ్య, మాజీ జీపీ గురప్ప, బార్‌అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, మాజీ అధ్యక్షుడు మస్తాన్‌వల్లి, న్యాయవాదులు బి. గురప్ప, ఆమీన్‌పీరా, రమణ, జీవీరత్నం, ధర్మ, అక్బర్ అలీ, భువన్‌రెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

కపటప్రేమ..!

- ఉరితాళ్లతో నిరసన
- నెలరోజులు దాటినా



అంగన్వాడీ అక్కచెల్లెమ్మలను పట్టించుకోని జగన్

మైదుకూరు, జనవరి 11 : సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందంటూ అంగన్ వాడీ కార్యకర్తలు, ఆయాలు చేస్తున్న సమ్మె గురువారం నాటికి 31 రోజులు దాటింది. అయినా ఇంత వరకు జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా కలుగచేసుకోలేదని, అక్కచెల్లెమ్మల మీద ప్రేమ కేవలం ఓట్ల కోసమే నంటూ అంగన్వాడీలు ఆరోపిస్తున్నారు. మైదుకూరులో ఎంపీడీవో కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మె దీక్షలకు టీడీపీ, జనసేన, ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు మద్దతు పలికారు. దీక్షలో ప్రశాంతి, వెంకటసుబ్బమ్మ, కామ సంజమ్మ, వేదమ్మ, మహాలక్ష్మి, సిద్దేశ్వరి,చవసుమతి, పుష్పలత, పద్మావతి, భాగ్య లక్ష్మి, హాజీబ్, శోభ రిలేదీక్ష చేపట్టారు.

కొండాపురం..: మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు,ఆయాలు గురువారం కొండాపురంలో వినూత్నంగా తమ నిరసన ను కొనసాగించారు. తమ సమ్మెకి 31 రోజులు కావడంతో 31 సంఖ్యగా ఏర్పడి మానవహారం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ నేతలు అంగన్వాడీలు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్వాడీలు చేస్తున్న సమ్మె గురువారానికి 31వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఉరి అయినా వేయండి, జీతాలైనా పెంచండంటూ మెడలో ఉరితాళ్లు వేసుకుని అంగన్వాడీలు నిరసన కార్యక్రమం చేపట్టారు. సమ్మెకు సంఘీభావం యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయ కుమార్ తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, షరీఫ్, సురేంద్ర, ఖదీరయ్య, అంగన్వాడీ నాయకురాళ్లు పాల్గొన్నారు.



కొండాపురంలో 31 సంఖ్యగా ఏర్పడి నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం




బద్వేలులో మెడకు ఉరి తాళ్లు వేసుకుని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు, మైదుకూరులో రిలే దీక్షలు చేస్తున్న అంగన్వాడీలు

పోరుమామిళ్ల..: అంగన్వాడీ కార్యకర్తల, ఆయా, వర్కర్ల డిమాండ్లు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవ ప్రసాద్ అన్నారు. గురువారం తహసీల్దారు కార్యాలయం ఆవరణంలో కొనసాగుతున్న సమ్మెనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగు ఐసీడీఎస్ కార్యాలయం ఎదురుగా అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు సమ్మెను గురువారం ఉధృతం చేపట్టారు. కార్యాలయం ఎదురుగా కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ,అంగన్వాడీలు తలపై కుర్చీలు పెట్టుకుని నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి తమ సమస్య పరిష్కరించకుంటే ఆయన కుర్చీ లాగేసుకుంటామని, ఈసారి జగన్‌కు పతనం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

చాపాడు..: తహసీల్దారు కార్యాలయం ఎదురుగా గురువారం అంగన్వాడీ కార్యకర్తలు ధర్నా చేశారు. సీఎం జగన్‌కు వ్యతిరేకంగా వారు నినాదాలు చేశారు. సీఎం సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఎర్రగుంట్ల..: అంగన్వాడీలు చేస్తున్న సమ్మెలో భాగంగా ఎర్రగుంట్ల తహసీల్దార్ వద్ద చేస్తున్న ధర్నా 31వ రోజుకు చేరింది. గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు నినాదాలు చేశారు.

ప్రొద్దుటూరు..: అంగన్‌వాడీలపై ప్రభుత్వ నిరంకుశ వైఖరి వీడాలని సీఐటీయూ జిల్లాకార్యదర్శి సత్యనారాయణ హెచ్చరించారు. గురువారం తహసీల్దారు కార్యాలయంలో చేపట్టిన అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 31 రోజుకు చేరుకుంది తహసీల్దారు కార్యాలయంనుంచి ర్యాలీగా వెళ్ళి శివాలయం సర్కిల్లో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్‌నేతలు అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.



పోరుమామిళ్లలో...



చాపాడులో...



ఎర్రగుంట్లలో...

జనాన్ని చూసి జగన్‌కు వణుకు పుట్టింది :భూపేశ్



మాట్లాడుతున్న జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, జనవరి 11: చంద్రబాబు పర్యటనలో ఆయన సభలకు వస్తున్న జనాలను చూసి ముఖ్యమంత్రి జగన్‌కు వెన్నులో వణుకు పుట్టిందని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ ప్రజలకు వైసీపీ చేస్తున్న అన్యాయాలను, అక్రమాలను ఎత్తి చూపేందుకే చంద్రబాబు రా కదలి రా ప్రచార కార్యక్రమాన్ని ప్రారంబించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సవాళ్లను, సమస్యలను ఆయన ఎత్తిచూపుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో జిల్లాలో అన్ని సీట్లు టీడీపీ గెలువబోతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జగన్ ఇంటి బాటకు సిద్ధం కావాల్సిందే : వరద



మైదుకూరు రోడ్డు వస్త్రభారతిలో ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు ,జనవరి 11 : వైసీపీ అరాచక పాలననుంచి ప్రజలు విముక్తి కోరుకుంటున్నారని ఇక జగన్ ఇంటి బాట పట్టక తప్పదని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. గురువారం మైదుకూరు రోడ్డులోని వస్త్రభారతి, న్యూ వస్త్రభారతిలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ముందస్తు మేనిఫెస్టో లో వున్న ఆరు గ్యారెంటీల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మెన్ ఆసం రఘురామిరెడ్డి, నాగమునిరెడ్డి, ఘంటశాల వెంకటేశ్వర్లు బచ్చులప్రతాప్, వస్త్రభారతి క్లాత్ మార్కెట్ అసోసియేషన్ నేతలు చీమల రాఘవేంద్రరెడ్డి, మేరువ పెంచలయ్య,రవ్వా అనిల్ ,పల్లా ప్రవీణ్, దేవరశెట్టి ఆదినారాయణ, వల్లంకొండు మల్లి, ఉమ్మడి శెట్టినాగభూషణం అగ్గారపు వెంకటస్వామి, మేడా సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

బాబుతోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తు

ప్రొద్దుటూరు ,జనవరి 11 : బాబుతోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తు సాధ్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్ చార్జ్ ప్రవీణ్‌రెడ్డి సోదరి హరితారెడ్డి పేర్కొన్నారు. గురువారం కొత్తపల్లె మీనాపురం లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ చేపట్టారు. కార్యక్రమంలో చింతకుంట రామ్మోహన్ నాయుడు, శివక్రిష్ణ నాయుడు, వెంకటయ్య, షరీఫ్, విజయ్‌నాయడు, రియాజ్ తాటిశ్రీను సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న హరితారెడ్డి

బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీపై ప్రచారం



పథకాలపై ప్రచారం చేస్తున్న టీడీపీ ఇన్‌ఛార్జ్ బొజ్జ రోశన్న

పోరుమామిళ్ల, జనవరి 11 : టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో ఆరు పథకాలపై బద్వేలు టీడీపీ ఇన్‌ఛార్జ్ బొజ్జ రోశన్న ప్రచారం చేశారు. గురువారం పోరుమామిళ్లలోని బలిజకోట తదితరవీధుల్లో ఆయన టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు.ఈ కార్యక్రమంల సర్పంచ్ యనమల సుధాకర్, టీడీపీ నాయకులు సీతా వెంకటసుబ్బయ్య, రామసుబ్బారావు, ఇమాంహుసేన్, శెట్టెం ప్రతాప్, ధర్వేష్, అన్వర్, అతికారి రాజా, దానం, వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, సత్యరాజ్ పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ కార్మికుల పెండింగు వేతనాలు చెల్లించాలి

బద్వేలు రూరల్, జనవరి 11 :కార్మికులతో పనిచేయించుకోవడంలో ఉన్న శ్రద్ధ వారికి వేతనాలు ఇవ్వడంలో లేదా అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సీపీఐ రూరల్ కార్యదర్శి నాగదాసరి ఇమ్మానుయేల్ ప్రశ్నించారు. గురువారం మండల పరిధిలోని పది పంచాయతీల్లో పనిచేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులతో కలిసి ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఆనందరావు, కల్యాణ్, శేఖర్, ఓబయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

నేడు 18వ విడత సామాజిక తనిఖీ

జమ్మలమడుగు, జనవరి 11: జమ్మలమడుగులో మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఏపీవో పద్మారాణి తెలిపారు. 28.12.2023 నుంచి 11.1.2024 వరకు జరిగిన పనులపై 18వ విడత సామాజిక తనిఖీ జరుగుతుందన్నారు.

భూములు కోల్పోయే రైతులతో నేడు సమావేశం

ఎర్రగుంట్ల, జనవరి 11: చాగలమర్రి-వేంపల్లి నేషనల్ హైవే రోడ్డు విస్తరణ కోసం భూములు కోల్పోయే రైతులతో శుక్రవారం ఉదయం ఎర్రగుంట్ల ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగేశ్వరరావు తెలిపారు. ఉదయం 10.30గంటలకు నిర్వహించే సమావేశానికి ఆర్డీవో శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. హనుమనగుత్తి,పోట్లదుర్తి, పెద్దనపాడు, వై.కోడూరు, ఎర్రగుంట్ల రైతులు ఈ సమావేశానికి తప్పక హాజరుకావాలన్నారు.

గడ్డివాములు కాల్చివేయడం దుర్మార్గం

కొండాపురం, జనవరి 11 :మండలంలోని తాళ్లప్రొద్దుటూరు గ్రామంలో కోమనూతల నరసింహ అనే జనసేన కార్యకర్తకు చెందిన గడ్డివాములను కాల్చివేయడం దుర్మార్గపు చర్య అని జమ్మలమడుగు నియోజకవర్గ ఆ పార్టీ ఇన్‌ఛార్జ్ అల్లం సూర్యనారాయణ తెలిపారు.గురువారం సంఘటన స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇలాంటి చర్యలు చేపట్టడం పిరికిపంద చర్య అని, వెంటనే పోలీసులు దర్యాప్తు చేసి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.ఇలా జరగడం రెండోసారి అని వెంటనే బాధితుడికి రూ.10 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యదర్శి శెట్టి నాగార్జున, జనసేన నాయకులు జగదీష్, శివకుమార్, కిరణ్‌రాయల్,లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి ఆహ్వాన పత్రికలు విడుదల

మైదుకూరు, జనవరి 11 : పట్టణంలోని శ్రీలక్ష్మీ మాదవ, ఆంజనేయ స్వామి ఆలయంలో ఈనెల 14 నుంచి సంక్రాంతి ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు గురువారం ఆలయంలో ఆహ్వానపత్రికలను ఆలయ చైర్మెన్ భూమిరెడ్డి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు యెలిశెట్టి గురు ప్రసాద్, శీలం లాలయ్య, జీటీ శ్రీధర్, కేవీ రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఎస్సీసెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఉదయ్‌కుమార్

కొండాపురం, జనవరి 11: జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఎస్సీసెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా కొండాపురానికి చెందిన ఏటూరు ఉదయ్‌కుమార్ నియమితులయ్యారు.ఈ సందర్భంగా కొండాపురం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో టీడీపీని గెలిపించేందుకు కృషిచేస్తామన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

కలసపాడు, జనవరి 11 : ఉద్యోగ,ఉపాధ్యాయ,పింఛన్ దారులకు వెంటనే మధ్యంతర భృతి ప్రకటించాలని ఏపీటీఎఫ్-257 సంఘం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఇ.బాలజోజి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద గురువారం ఏపీటీఎఫ్-257 సంఘం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు జి. బాలఓబయ్య, ఆర్థిక కార్యదర్శి బి.ప్రభాకర్, కిరణ్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, గురయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లలో స్థలాలు, కొనుగోలు చేయవద్దు

చాపాడు, జనవరి 11: మండల కేంద్రమైన చాపాడులో అక్రమంగా వేసిన లేఅవుట్లలో ఎవరు కూడా ఇళ్లస్థలాలు కొనుగోలు చేయవద్దని కడప అర్బన్ డెవలప్‌మెంట్ అధికారి ఏపీవో క్రిష్ణసింగ్ చెప్పారు. క్రిష్ణసింగ్, జేపీవో ఇందు, చాపాడు గ్రామ కార్యదర్శి ధనుంజయబాబు, మహిళా పోలీసు గురువారం ఈ స్థలాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. సర్వే నంబర్లు 35, 60, 105, 64-2ఎ, 41లలో మొత్తం ఏడున్నర ఎకరాల విస్తీర్ణంలో లేఅవుట్లు వేశారన్నారు. అక్రమంగా లేఅవుట్లు వేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఎవరైనా ఇంటి స్థలాలు కొనుగోలు చేస్తే భవన నిర్మాణాలు చేపడితే అనుమతులు ఇవ్వమన్నారు. భూముల యజమానులు తమ కార్యాలయానికి వచ్చి అనుమతులు తీసుకోవాలని కృష్ణసింగ్ పేర్కొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు, జనవరి 11 : మైదుకూరు నియోజకవర్గంలో చాలా మంది వైసీపీ నాయకులు టీడీపీలోకి వలసలొస్తున్నారు. సర్పంచ్, మాజీ జడ్పీటీసీలు సైతం ఇప్పటికే పలువురు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో టీడీపీలో చేరుతున్నారు. తాజాగా గురువారం సాయంత్రం టీడీపీ పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, స్థానిక కౌన్సిలర్ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని 10వ వార్డులోగల గడ్డమాల వాడలో వైసీపీకి చెందిన చెంద్రాయుడు ఆయన అనుచరులు, గ్రామస్థులతో పాటు దాదాపు 80 కుటుంబాల వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మహిళలతో పాటు వీరందరికి సుధాకర్‌యాదవ్ శాలువలు కప్పి టీడీపీలోకి చేర్చుకున్నారు. టీడీపీ నాయకులు ధనపాల జగన్, బీయస్ శ్రీనివాసులు, ఏపీ రవీంద్ర, బీపీ సుధ, పాల మాబు,కొండపల్లి ఉమాకాంత్, జనసేన నాయకుడు మల్లోత్ర పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు సామాన్య ప్రజలకు అందాలి

ప్రొద్దుటూరు , జనవరి 11 : కేంద్రప్రభుత్వం అందించే పథకాలు సామాన్యప్రజలకు అందాలనే ధ్యేయంతో భారత్ వికాస్ సంకల్ప యాత్రను చేపట్టామని నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ గొర్రె శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం నంగనూరు పల్లె గ్రామంలో వికసిత భారత్ సంకల్ప యాత్రను బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టారు. అనంతరం ఉజ్వల్ పథకం కింద మహిళలకు ఉచితగ్యాస్ సిలిండర్‌లను పంపిణీచేశారు బీజేపీ జిల్లాకార్యదర్శి సుబ్రహ్మణ్యం, మహిళా మోర్చా రాష్ట్ర కోశాధికారి జయలక్ష్మి, వులసాల రామచంద్రుడు, మండల అధ్యక్షుడు కంభగిరి పాల్గొన్నారు.

19న కమలాపురంలో రా.. కదిలిరా బహిరంగ సభ :లింగారెడ్డి



ప్రొద్దుటూరు టౌన్, జనవరి 11 : టీడీపీ రా.. కదలి రా బహిరంగ సభ ఈనెల 19న కమలాపురంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి తెలిపారు. గురువారం టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రా.. కదలి రా బహిరంగ సభకు చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరవుతారని, జిల్లా, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, భవిష్యత్తు గ్యారెంటీ గురించి వివరిస్తారన్నారు. వైసీపీ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలు, కుంభకోణాల గురించి ప్రజలకు వివరిస్తారన్నారు. జగన్ ప్రభుత్వం ఆస్తులు తాకట్టు పెట్టి అప్పులు తెచ్చిందని, రూ.12 లక్షల కోట్లు అప్పు చేసిందని విమర్శించారు. మద్యం, ఆర్టీసీ బస్సు కరెంటు, రిజిస్ట్రేషన్ చార్జీలు, ఇంటి పన్ను, చెత్తపన్ను, పెట్రో, డీజిల్ సెస్ ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం వస్తోందన్నారు. ఆ డబ్బు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. రుషి కొండలో నిర్మించిన ప్యాలెస్ నిధులతో రాజోలి రిజర్వాయర్, దువ్వూరు మండలంలో తెలుగుగంగ లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేసి ఉండవచ్చున్నారు. పులివెందుల ప్రాంతంలో రైతులను ఆదుకోవడానికి చంద్రబాబు నిమ్మ, చీని రైతులకు సాగు నీరు అందిస్తే, జగన్ గండికోట, వామికొండ, సర్వరాయసాగర్ ప్రాజెక్టులకు పంట కాలువలు నిర్మించలేకపోయారన్నారు. సమావేశంలో టీడీపీ జిల్లా కార్యదర్శి సిద్ధయ్య, మైనారిటీ సెల్ జిల్లా సహాయ కార్యదర్శి టప్పా మహబూబ్‌బాషా, లీగల్ సెల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గుర్రప్ప, విజయభాస్కర్‌రెడ్డి, సుబ్బరాజు పాల్గొన్నారు.

ఆక్రమణకు మళ్లీ సిద్ధం..!

మైదుకూరు, జనవరి 11 : పట్టణంలోని పొట్టిశ్రీరాముల సర్కిల్‌లోని చిన్న మసీదు పక్కన ఉన్న ప్రభుత్వ భూమి మరో సారి ఆక్రమణకు గురవుతోంది. ఇప్పటికే ఆ ప్రాంతంలోని ప్రభుత్వానికి చెందిన ఖాళీ స్థలాలను ఆక్రమించుకొని గృహాలు, వ్యాపారాల కోసం షెడ్లు వేసుకొని జీవన కొనసాగిస్తున్నారు. గతంలో ఆ ప్రాంతంలో మార్కెట్‌కు కేటాయించడం కూడా జరిగిపోయింది. అయితే పాలకుల నిర్లక్ష్యంతో ఏమాత్రం ప్రభుత్వ భూమిపై శ్రద్ధ చూపలేదు. కాగా తాజాగా మసీదు పక్కన ఖాళీ స్థలంలో మరొకరు రేకులషెడ్ వేసి వ్యాపారం నిర్వహించేందుకు తగిన ఏర్పాటు చేస్తున్నారు. పాలకులు కాకపోయినా అధికారులైన ఆక్రమితమైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని ప్రజాఅవసరాలకు వినియోగించుకోవల్సిందిగా పలువురు కోరుతున్నారు.



ఏర్పాటు చేస్తున్న రేకుల షెడ్డు

రిజిస్టరు విలువ కన్నా రెట్టింపు పరిహారం చెల్లిస్తాం

జమ్మలమడుగు ఆర్డీవో శ్రీనివాసులు



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసులు

రాజుపాలెం, జనవరి 11 : వేంపల్లె - చాగలమర్రి జాతీయ రహదారి భూ సేకరణలో భూములు కోల్పోతున్న రైతులకు రిజిస్టరు విలువ కన్నా రెట్టింపు పరిహారం చెల్లిస్తామని జమ్మలమడుగు ఆర్డీవో జి.శ్రీనివాసులు తెలిపారు. గురువారం మండల కేంద్రమైన రాజుపాలెంలోని ఎంపీడీవో సభా భవనంలో రైతులకు నష్టపరిహారం చెల్లింపులో అవార్డు విచారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న భూములకు గత మూడేళ్ల కాలానికి రిజిస్టరు విలువలో సరాసరి ధర లెక్కల్లోకి తీసుకుని ఆ విలువ కన్నా రెట్టింపు పరిహారం అందిస్తామన్నారు. నూతనంగా ఏర్పాటు చేయబోయే జాతీయ రహదారి నెం.440కి భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం విషయంలో న్యాయం జరిగేలా చూస్తామన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించి సుమారు 107 ఎకరాల్లో భూసేకరణ జరిగిందన్నారు. ఈ జాతీయ రహదారికి సర్వేనెంబరు ప్రకారం ఎంత విస్తీర్ణంలో భూములు అవసరం అన్నది గెజిట్ పబ్లికేషన్ కూడా పూర్తయిన తరువాతనే రైతులతో సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. రైతులు పంట పొలాల్లో బోర్లు, బోరుబావి కానీ ఉంటే వాటికి కూడా పరిహారం అందిస్తామన్నారు. రైతులు మాట్లాడుతూ రోడ్డుకు పోను మిగిలిన భూమికి వర్షం నీరు వెళ్లేందుకు హైలెవెల్ కాజ్‌వే నిర్మాణాలు చేపట్టాలని రైతులు కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందిలేకుండా రహదారి నిర్మిస్తామన్నారు. రైతులకు పరిహారం విషయంలో ఏమైనా సందేహాలున్నా, ఇంకా కావాలన్నా కలెక్టరుకు తెలియజేసుకోవచ్చని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ఇంద్రాణి, నేషనల్ హైవే ఏఈ సురేందర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దారు సాయినాధరెడ్డి, ఇన్‌ఛార్జ్ ఆర్‌ఐ అశోక్‌కుమార్, ఆయా గ్రామ రెవెన్యూ అధికారులు, భూములు కోల్పోతున్న రైతులు పాల్గొన్నారు.